

## 'విశ్వకర్మ'ను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను సంప్రదాయ చేతివృత్తిదారులంతా ఉపయోగించుకోవాలని కలెక్టర్ శివశంకర్ కోరారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పరిశ్రమల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, మున్సిపాలిటీలో విశ్వకర్మ పథకానికి బట్టలు కుట్టే దర్జీలు, తాపీ పనిచేసేవారు నమోదు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పథకాలు అమలయ్యేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమములో డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు, జడ్‌పిసిఇ, ఎంప్లా య్మెంట్ అధికారి, కడప, జిల్లా పంచాయతీ అధికారి, పరిశ్రమల శాఖ సంయుక్త సంచాలకులు జయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్‌కు రూ.2,130 కోట్లు


- బిల్లుల చెల్లింపులకు రూ.830 కోట్లు
- పిబిసికి రూ.330 కోట్లు
- తెలుగుగంగకు రూ.6 కోట్లు
- 'అన్నమయ్య'కు ఎగనామం



అరకొర నిధులకే పరిమితమైన బ్రహ్మసాగర్ రిజర్వాయర్

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

ప్రభుత్వం ఇటీవలి ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌లో జిల్లా నీటి పారుదల శాఖ విభాగానికి రూ.2,130 కోట్లు కేటాయించింది. ఉమ్మడి కడప జిల్లాలోని 14 ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేసింది. రూ.1300 కోట్లు ప్రాజెక్టు పనులకు, రూ.830 కోట్లు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు పద్దును కేటాయించింది. ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ ముంగిట జిల్లా నీటిపారుదల శాఖ ప్రతిపాదించిన రూ.2,130 కోట్ల పద్దును యథాతథంగా ఆమోదించడం పట్ల ఇంజినీరింగ్ అధికారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లా నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం జిల్లాలో గతంలో చేసిన అభివృద్ధి పనులు, పెండింగ్ బిల్లుల ప్రతిపాదనల తరహాలో మిగిలిన జిల్లాలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదించక పోవడమే యథాతథ ఆమోదానికి కారణమనే వాదన వినిపిస్తోంది. అత్యధికంగా పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పిబిసి)కు రూ.330 కోట్లు కేటాయించింది. రూ.200 కోట్లు ప్రాజెక్టు పనులకు, మిగిలిన రూ.130 కోట్లను ఇంజినీరింగ్ యంత్రాంగం జీతభత్యాలకు వ్యయం చేయనుంది. గండికోట నిర్వాసితుల పరిహారం చెల్లింపులకు రూ.78 కోట్లు, తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలోని కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన తెలుగుగంగ ప్రాజెక్టు రూ.430 కోట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన బ్రహ్మసాగర్ రిజర్వాయర్ అభివృద్ధి పనులకు రూ.ఆరు కోట్లు మాత్రమే కేటాయించడం గమనార్హం. కడప జిల్లాలోని బుగ్గవంక, అన్నమయ్య జిల్లాకు చెందిన ప్రధాన రిజర్వాయర్లుగా పరిగణ పొందిన అన్నమయ్య రిజర్వాయర్ ఇన్వెస్టిగేషన్ బిల్లు చెల్లింపులకు రూ.78 లక్షలు, వెలిగల్లు, రూ.100 కోట్ల వ్యయంతో కూడిన ఎత్తిపోతల పనులకు ఎటువంటి కేటాయింపులు చేలేదు.



నిధుల కేటాయింపునకు అన్నమయ్య ప్రాజెక్టు

## సానుకూల దృక్పథంతో
# బాధ్యతలు నిర్వర్తించాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - కడప**

అర్జీదారులు, ఫిర్యాదుదారుల పట్ల సహనంతో, సానుకూల దృక్పథంలో స్పందించ గలిగినపుడే అధికారులు ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలరని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) హాలులో ఇటీవల అమరావతిలో ముఖ్యమంత్రి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో సమీక్షించిన అంశాలను జిల్లా అధికారులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖాధిపతులు ఎల్లప్పుడూ ఉన్నత స్థాయి అధికారులు, ప్రజలకు సమాచారం అందిచ్చుకునేలా అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కార్యాలయ వ్యవస్థను పదిలం చేయడంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. ప్రభుత్వంలో మనం చేసే ప్రతి పనీ ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులకు మంచి పేరు వచ్చేలా చేపట్టాలన్నారు. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విధి నిర్వహణలో వర్చువల్ గవర్నెన్స్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లేముందు ముందస్తు ప్రణాళికతో వెళ్లాలని, అవసరమనుకున్న చోట ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహించాలని చెప్పారు. మనం నిర్వహించే ప్రతి సమావేశం ప్రజలను చైతన్య పరిచేలా ఉండాలన్నారు. మన పరిధిలో పబ్లిక్, ప్రయివేటు సంస్థల భాగస్వామ్యాన్ని పెంపొం దించా లన్నారు. జిల్లాలో పచ్చదనం పెంచడం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా 5 లక్షల మొక్కలను నాటే లక్ష్యంగా సంబంధిత శాఖలు, విద్యార్థులు, స్వచ్ఛంద.సంస్థల భాగస్వామ్యంతో ముందు కెళ్లాలన్నారు.జిల్లా జిఎస్‌డిపి ప్రమాణాలను పెంచే విధంగా అభివృద్ధి పనులపై దృష్టి సారిం చాలన్నారు. అన్ని శాఖల పరంగా ప్రభుత్వం నిర్దేశిం చిన లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయా లన్నారు. జిల్లాలో చేపట్టే పారిశ్రామిక అభివృద్ధి పనులకు పెట్టుబడులే కాకుండా రాబడులపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 'వీక్షిత్ ఆంధ్రా ఏ2024' లక్ష్య సాధన కోసం జిల్లాలో జిల్లా ప్రాణాళి కాధికారి ఆధ్వర్యంలోఈనెల 13న వర్క్ షాప్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి బుధవారం మండల ప్రత్యేకాధికారులు, సంబంధిత మండల అధికారులు గ్రామ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వ హించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉదయం నుంచి గ్రామ ప్రజలతో మమేకమై వారి రోజువారీ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యక్షంగా అక్కడి సమస్యల్ని గుర్తించాలన్నారు. సోలార్ పవర్ ఉత్పత్తిని పెంపొందిస్తూ విద్యుత్ వృథాను, ఖర్చును నియం త్రించాలన్నారు. సెప్టెంబర్ 1 నుంచి జిల్లాలో ప్రతి సోమవారం 'హ్యాండ్ లూమ్ డే' ని అమలు చేయా లని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్య సాధనలో భాగంగా శాఖల వారీగా చేపట్ట వాల్సిన కార్యక్రమాల ప్రణాళికలు, కర్తవ్యాల గురించి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా కలెక్టర్ క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో జెసి, అదితిసింగ్, డిఆర్ఓ గంగాధర్‌గౌడ్, నాలుగు రెవెన్యూ డివిజన్ల ఆర్‌డిఒలు, అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

# వివక్షత చూపరాదు : జడ్జి



మాట్లాడుతున్న జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్

**ప్రజాశక్తి - కడప**

విభిన్న ప్రతిభావంతులైన పిల్లల పట్ల ఎలాంటి వివక్షత చూపరాదు అని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. గురువారం కడప నగరంలోని శంకరాపురంలో ఉన్న ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో 'సెన్సిటైజేషన్ ప్రోగ్రాం, న్యాయ విజ్ఞాన సదస్సు' జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయం న్యాయ సేవాధికార సంస్థ (మానసిక అనారోగ్యం, మానసిక వికలాంగులకు చట్టపరమైన సేవలు) పథకం, 2015 గురించి వివరించారు. విభిన్న ప్రతిభావంతులైన పిల్లల పట్ల ఎలాంటి వివక్షత చూపరాదని, 18 సంవత్సరాలు వచ్చేవరకు వీరికి ఉచిత విద్యను అందించాలన్నారు. వీరికి ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో ప్రవేశాలు , ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు న్యాయ సేవలు ఉచితంగా అందిస్తారన్నారు. పిల్లలకు పాఠశాలలో సులభతరమైన అంశాలపై శిక్షణ, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతులైన పిల్లల ప్రత్యేక అవసరాలు గుర్తించి సంబంధిత ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ వాధికారి సంస్థ కడప వారి దృష్టికి తీసుకుని రావచ్చును అన్నారు.అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డిజబుల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆర్.వి కృష్ణ కిషోర్, డిస్ట్రిక్ ప్రొబెషన్ ఆఫీసర్ జి.చెన్నారెడ్డి, మండల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గంగిరెడ్డి, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, జి సునీత, వైద్యాధికారి, మధుర, పాఠశాల హెచ్‌ఎం ఎబినేజర్ ఇమ్మానియేల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వినేష్ ఫోగట్‌పై అనర్హత వేటు దారుణం : డివైఎఫ్ఐ




నిరసన కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు

**ప్రజాశక్తి- కడప అర్బన్**

2024 పారిస్ ఒలింపిక్స్ నుంచి వినేష్ ఫోగట్‌ను ఏకపక్ష, అన్యాయంగా అనర్హులుగా ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. గురువారం కడప ఐటిఐ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది భారతీయ క్రీడలకు ఎదురుదెబ్బ మాత్రమే కాదు, ఫెయిర్ ప్లే, స్పిరిట్‌పై కఠోరమైన దాడి అన్నారు. వినేష్ ఫోగట్ స్థితిస్థాపకత, ధైర్యం, శ్రేష్ఠత తిరుగులేని అన్వేషణకు చిహ్నమని తెలిపారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో పాతుకుపోయిన అస్వస్థతను బహిర్గతం చేసిన అధ్యాయం, మాజీ బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్ అణచివేత పాలనకు వ్యతిరేకంగా ఆమె ప్రయాణం చారిత్రాత్మక పోరాటంతో ముడిపడి ఉందని చెప్పారు. వినేష్ అనర్హత చుట్టూ ఉన్న పరిస్థితులు అనుమానాస్పదంగా ఉన్నాయని పేర్కొన్నారు. చెడు కుట్ర వైపు చూపుతున్నాయి. ఈ విషయంలో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, దాని అధికారుల పాత్రపై సమగ్రమైన, నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నరసింహులు, బాలాజీ, గణేష్,హేమంత్, జశ్వంత్,నిత్య, విద్యార్థినులు పాల్గొన్నారు.



బిసి కార్పొరేషన్ ఇడి జయసింహకు వినతిపత్రం ఇస్తున్న అధ్యక్షులు చేలో రవి

## రజకుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి - కడప**

రజకుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం జిల్లా రజక సంఘం అధ్యక్షులు చేలో రవి, సంఘం నాయకులు బిసి కార్పొరేషన్ ఇడి జయసింహను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు చేలో రవి మాట్లాడుతూ కడప నగరంలో రజకులు తమ కుల వృత్తిని చేసుకునేందుకు ధోబీ ఘాట్‌లు అవసరమని, అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. కడప జిల్లాలో కొన్ని ధోబిఘాట్లు బోరులో నీటి వసతి లేక, మోటారు పనిచేయక, విద్యుత్ కనెక్షలు లేక నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వాటిని తయారు చేయించాలని కోరారు. జిల్లాలో విద్యావంతులైన నిరుద్యోగులకు సబ్సిడీ రుణం కింద రూ. 5 లక్షలు మంజూరు చేయాలన్నారు. బిసి స్టడీ సర్కిల్‌ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. స్పందించిన ఇడి తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను కలెక్టర్‌కు తెలియజేసి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా రజక సంఘం నాయకులు చెన్నప్ప, పిచ్చయ్య, ఎరికలయ్య ఉన్నారు. తొలుత బీసీ కార్పొరేషన్ ఈడీని రజక సంఘం నాయకులు సన్మానించారు.

## ఎస్ఐ అనిల్ బదిలీని ఆపండి
### - ఎస్‌పికి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి లేఖ

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

ఎస్ఐ అనిల్ కుమార్ బదిలీని ఆపాలంటూ శాసనమండలి సభ్యుడు భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డి ఎస్‌పి హర్షవర్ధన్ రాజు కు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. గురువారం జిల్లాలో ఎస్ఐల బదిలీలపై ఉత్తర్వులు వచ్చాయి. ఇందులో సింహాద్రిపురం ఎస్ఐగా ఉన్న అనిల్ కుమార్‌ను పులివెందుల స్టేషన్‌కు బదిలీ చేశారని, ఆయన ఎన్నికల ముందు సింహాద్రిపురం ఎస్ఐగా వచ్చారని తెలిపారు. ఎన్నికల సమయంలో పోలింగ్ రోజు మండలంలో అనేక అరాచకాలకు పాల్పడినట్లు లేఖలో ఎమ్మెల్యే పేర్కొన్నారు. సాక్ష్యాత్తు తనపైనా, కుటుంబ సభ్యులపైనా దురుసుగా, అవమానకరంగా ప్రవర్తించారని వాపోయారు. ఆయనపై గతంలో ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేశానని తెలిపారు. గతంలో పులివెందుల ఎస్ఐగా పనిచేశారన్నారు. అప్పుడు అవనీతి, అక్రమాలకు పాల్పడడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. అర్హత లేకున్నా తన కుటుంబ సభ్యుల పేర్లపైన తప్పుడు పత్రాలు సమర్పించి ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఇనోవా కారును తీసుకు న్నార న్నారు. దీనిపై కూడ ఆయనపై దర్యాప్తు చేశారన్నారు. పులివెందుల వైసిపి నాయకులకు, ఆయనకు అత్యంత సన్నిహిత, వ్యాపార సంబంధాలు ఉన్నాయని వెల్లడించారు. శాంతి భద్రతలను పరిరక్షించకుండా మట్కా, జూదాన్ని ప్రోత్సపిస్తారని, వెంటనే అయన బదిలీని ఆపి, ఒక సమర్థవంతమైన అధికారిని ఎస్ఐగా నియమించాలని ఎస్‌పికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

### ఐటిఐ విద్యార్థుల సమస్యలపై ఆర్‌డిఒకు వినతి

**ప్రజాశక్తి - మైదుకూరు:** జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోని రవాణా సౌకర్యం లేని తొండూరు ఐటిఐ పరీక్షా కేంద్రాన్ని మార్చి పోరుమామిళ్ల తదితర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి భార్గవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి జమ్మలమడుగు ఆర్‌డిఒ శాంతమ్మకు వినతి పత్రం అందజేశారు.

# జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - కడప**

ఆకాంక్ష జిల్లాల ఆశయాలకు అనుగుణంగా అధికారులు జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. గురువారం న్యూఢిల్లీ నుంచి నీతి అయోగ్ సిఇఒ బి.వి. ఆర్ సుబ్రహ్మణ్యం ఆకాంక్ష జిల్లాల ఆశయ సాధనలో భాగంగా జిల్లాలో కార్యాచరణ, ప్రగతిపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ శివశంకర్ లోతేటి తోపాటు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టం మాట్లాడుతూ 2018లో 'నీతీ ఆయోగ్' ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కొన్ని ఆకాంక్ష జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. మన రాష్ట్రంలో వైఎస్ఆర్ జిల్లా, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. అందులో భాగంగా ఆయా జిల్లాల్లో సామాజిక స్థాయిని ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రతి మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాదికి ఒకసారి 6 అంశాలకు సంబంధించి కీ పారామీటర్ ఇండికేట్ (కెపిఐ) పాయింట్ల ఆధారంగా ప్రగతిని లెక్కించడం జరుగుతుందన్నారు. అందులో ముఖ్యంగా హెల్త్ అండ్ న్యూట్రిషన్, ఎడ్యుకేషన్ - నైపుణ్యాభివృద్ధి, గృహ నిర్మాణం, వ్యవసాయం, పశుపోషణ, మౌలిక సదుపాయాలు మొదలైన శాఖల్లో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేస్తున్నామన్నారు. అందుకోసం సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సంతృప్త స్థాయిలో నిర్దేశిత లక్ష్యం మేరకు సాధించిన ప్రగతి ఆధారంగా ప్రోత్సాహకాలను కూడా భారీ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అన్ని శాఖల పరిధిలో కొరత ఉన్న సౌకర్యాలు, సదుపాయాలు, అవసరాలను ఎప్పటికప్పుడూ పూర్తి చేయాలని పేర్కొన్నారు. వినూత్నమైన ఆలోచనలకు నిర్మాణ రూపం ఇచ్చేందుకు ప్రతి శాఖ సంసిద్ధం అవ్వాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, సిపిఒ వెంకట్రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అనురాధ హాజరయ్యారు.



మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

# జిల్లాలో భారీగా ఎస్ఐల బదిలీలు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

కడప జిల్లాతో పాటు, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్, విఆర్‌లలో ఉన్నటువంటి 64మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ బదిలీ చేశారు. కాశినాయన ఎస్ఐని అమర్‌నాథరెడ్డిని కడప వన్‌టౌన్‌కు, కడప దిశా పిఎస్ ఎస్ఐ కె. ప్రదీప్ నాయుడును కడప తాలూకాకు, కడప డిఎస్‌బి ఎస్ఐ డి. టైర్ హుసేన్‌ను కడప తాలుకాకు బదిలీ చేశారు. కడప తాలూకా ఎస్ఐని కె.బి.మల్లికార్జునను కడప విఆర్‌కు, కడప డిఎస్‌బి ఎస్ఐ ఎన్.రాజరాజేశ్వరి రెడ్డిని కడప చిన్న చౌక్‌కు, అన్నమయ్య జిల్లా పెనగలూరు ఎస్ఐ సుభాష్ చంద్రబోస్‌ను కడప రిమ్స్‌కు, బి.కోడూరు పిఎస్ ఎస్ఐ యు.వై. జయ రాములును రిమ్స్ పిఎస్ కు బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లా పి. సుండుపల్లి పిఎస్ ఎస్ఐ ఎస్.కె.ఎం హుస్సేన్ కడప టూ టౌన్‌కు, కడప టూ టౌన్ ఎస్ఐ జి.మధుసూదన్ రెడ్డి పెండ్లిమర్రి పిఎస్‌కు, ప్రొద్దుటూరు వన్‌టౌన్ పిఎస్ ఎస్ ఐ పి.మంజునాథ్ వీరపునాయుని పల్లెకు బదిలీ అయ్యారు. కడప టూ టౌన్ ఎస్ఐ ఎం.ఎన్. సంజీవ రాయుడును కొల్లూరు పిఎస్‌కు, ప్రొద్దుటూరు రూరల్ పిఎస్ ఎస్ఐ బి.శివప్రసాద్‌ను ఒంటిమిట్ట పిఎస్‌కు, కడప విఆర్‌లో ఉన్నటువంటి పి.సి. జయ గోపాల్‌ను కడప పిసిఆర్‌కు, సింహాద్రిపురం పిఎస్ ఎస్ఐ ఎం.బి.అనిల్ కుమార్‌ను పులివెందుల పిఎస్ కు, కడప రిమ్స్ పిఎస్ ఎస్ఐ వి.నారాయణను పులివెందుల పిఎస్‌కు బదిలీ చేశారు. ఆర్కే వ్యాలీ పిఎస్ ఎస్ఐ ఎం.రంగారావును, వేంపల్లి పిఎస్‌కు, కడప తాలూకా పిఎస్ ఎస్ఐ తిరుపాల్ నాయక్‌ను వేంపల్లి పిఎస్‌కు, రాజుపాలెం పిఎస్ ఎస్ఐ తులసి నాగప్రసాద్‌ను సింహాద్రిపురం పిఎస్‌కు, సిద్ధవటం పిఎస్ ఎస్సై బి.పెద్ద ఓబన్నను తొండూరు పిఎస్ కు బదిలీ చేశారు. తొండూరు పిఎస్ ఎస్ఐ సి. లక్ష్మీనారాయణను కడప విఆర్‌కు, ఒంటిమిట్ట పిఎస్ ఎస్ఐ బి.మధుసూదన్ రావును లింగాల పిఎస్‌కు, ఎర్రగుంట్ల పిఎస్ ఎస్ఐ ఎం.భాస్కర్ రెడ్డిని ఆర్‌కె వ్యాలీకి, వేంపల్లి పిఎస్ ఎస్ఐ పి. ప్రవీణ్ కుమార్‌ను వేముల పిఎస్‌కు, లింగాల పిఎస్ ఎస్ఐ బి.వి.కృష్ణయ్యను చక్రాయపేట పిఎస్‌కు దువ్వూరు పిఎస్ ఎస్ఐ ఎస్.శ్రీనివాసులను ప్రొద్దుటూరు వన్ టౌన్‌కు, ప్రొద్దుటూరు వన్ టౌన్ ఎస్ఐ పి.హైమావతిని కడప విఆర్ కు బదిలీ చేశారు. వేముల పిఎస్ ఎస్ఐ జె.ధనుంజయుడును ప్రొద్దుటూరు టూ టౌన్‌కు, వల్లూరు పిఎస్ ఎస్ఐ కె.వెంకటరమణను రాజుపాలెం పిఎస్‌కు, కొండాపురం పిఎస్ ఎస్ఐ పి.యోగేంద్రను ప్రొద్దుటూరు 3 టౌన్‌కు, ప్రొద్దుటూరు 3 టౌన్ పిఎస్ ఎస్ఐ జ్యోతిని కడప సిసిఎస్ కు బదిలీ చేశారు. కడప విఆర్‌లో ఉన్నటువంటి ఆర్‌పి ఎస్ఐ ఎం.భాస్కర్‌ను ప్రొద్దుటూరు ట్రాఫిక్‌కు, చిన్న చౌక్ పిఎస్ ఎస్ఐ మొహమ్మద్ రఫీని ప్రొద్దుటూరు రూరల్ పిఎస్‌కు, కడప వి ఆర్ ఎస్ఐ సుబ్బారావును మైదుకూరు పిఎస్‌కు, బద్వేలు రూరల్ పిఎస్ ఎస్ఐ జె.రవికుమార్‌ను బద్వేల్ అర్బన్ పిఎస్‌కు బదిలీ చేశారు. చక్రాయపేట పిఎస్ ఎస్ఐ ఎస్.వినోద్ కుమాం దువ్వూరు పిఎస్‌కు, తాళ్ల ప్రొద్దుటూరు పిఎస్ ఎస్ఐ జె.చంద్రశేఖర్ భీమటం పిఎస్‌కు, అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పిఎస్ ఎస్సై కె.చిన్న పెద్దయ్య చాపాడు పీఎస్‌కు, ప్రొద్దుటూరు టూ టౌన్ పిఎస్ ఎస్సై బి.రామకృష్ణ అట్లూరు పిఎస్‌కు, అట్లూరు పిఎస్ ఎస్ఐ కె.చాపల రాజు బి.కోడూరు పిఎస్ కు, చాపాడు పీఎస్ ఎస్ఐ ఆర్. వి.కొండారెడ్డి పోరుమామిళ్ల పిఎస్‌కు, ప్రొద్దుటూరు రూరల్ పిఎస్ ఎస్ఐ కె.చిరంజీవి కలసపాడు పిఎస్‌కు బదిలీ అయ్యారు. టి.పట్నం ఎస్ఐ పి. హనుమంతును కాశినాయనకు, కలసపాడు పిఎస్ ఎస్ఐ బి.నాగ మురళిని ఎర్రగుంట్ల పిఎస్ కు, పులివెందుల పిఎస్ ఎస్ఐ ఎం. విష్ణు నారాయణను ఎర్రగుంట్ల పిఎస్‌కు, పెద్దముడియం పిఎస్ ఎస్ఐ బి.రామకృష్ణను జమ్మలమడుగు పిఎస్‌కు, జమ్మలమడుగు పిఎస్ ఎస్ఐ కె.సుబ్బారావును పెద్దముడియం పిఎస్‌కు, బి.మఠం పిఎస్ ఎస్ఐ ఎ.విద్యాసాగర్ ను కొండాపురం పిఎస్‌కు బదిలీ చేశారు. కడప విఆర్‌లో ఉన్నటువంటి ఎల్. తిమోతిని కలమల్ల పిఎస్‌కు, కమలాపురం పిఎస్ ఎస్ఐ జి.హృతికేశ్వర్ రెడ్డిని తాళ్ల ప్రొద్దుటూరు పిఎస్‌కు, కడప విఆర్‌లో ఉన్నటువంటి ఎస్ఐలు సి.బాల అంకయ్య, ఆర్. మురళి మోహన్, బి.అరుణ్ రెడ్డి కడప డి ఎస్ బికి బదిలీ చేశారు. అనంతపురం జిల్లా ఇటుకల పల్లె పిఎస్‌లో ఎస్ఐ విధులు నిర్వహిస్తున్న ఆర్.రాఘవేంద్ర రెడ్డిని ప్రొద్దుటూరు టూ టౌన్‌కు, చిత్తూరు జిల్లా చౌడేపల్లి పిఎస్‌కు చెందిన యు. ప్రతాపరెడ్డి ని కమలాపురం పిఎస్‌కు, అన్నమయ్య జిల్లా మదనపల్లి వన్ టౌన్ పిఎస్ ఎస్ఐ బి.బాలకృష్ణను బద్వేలు రూరల్ పిఎస్‌కు బదిలీ చేశారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

**ప్రజాశక్తి-చెన్నూరు**

ప్రస్తుత వాతావరణంలో అధికమవుతున్న కాలుష్యాన్ని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటాలని మదర్‌థెరిసా ఫౌండర్ విజయ్ కుమార్ అన్నారు. జిబివిఎస్ ది ప్రిజర్వేషన్ సేవా సమితి ఆధ్వర్యంలో చెన్నూరు పెన్నా నది సమీపంలోని ఆంజనేయ పురం గ్రామంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రాంతంలోనే కాకుండా పట్టణ పరిసరాల్లో, విద్యా సంస్థల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా సేవా సమితి వ్యవస్థాపకులు, ఎన్ ఎస్ఎస్ వాలంటీర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ గాలిలో ఆక్సిజన్ శాతం తక్కువ అయితే రాబోయే రోజుల్లో మానవ మనగడకు ఇబ్బందులు ఎదుర వుతాయని, వాతావరణం దెబ్బ తినడం వల్ల సకాలంలో వర్షం కురవదని పేర్కొ న్నారు. ఇలాంటి విపత్తుల నుంచి బయట పడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడానికి నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు విక్రమ్ శరణ్ పాల్గొన్నారు.

## మరో పథకం అమలుకు శ్రీకారం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

రాష్ట్రంలో మరో పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని టిడిపి బ్రాహ్మణ సాధికార సమితి పార్లమెంటు కన్వీనర్ జనార్ధన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయివేట్ ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాలకు రూ.10వేలు ఇచ్చేందుకు ఏపీ ప్రభుత్వం జీవో జారీ చేయడం హర్షణీయం అని తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుకు చర్యలు తీసుకోవడం అభినందనీయని పేర్కొన్నారు. రాష్ట్రంలో 'నిధులు లేక రూ. 6 వేలుతో కనీసం ధూప, దీప, నైవేద్యాలకు నోచుకోవడం లేదని తెలిపారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో రూ.5వేలు ఇచ్చారని పేర్కొన్నారు. మాటిచ్చిన ప్రకారం దాన్ని రూ.10వేలు చేశారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన 50 రోజుల్లోనే హామీ అమలు చేయడం పట్ల చంద్రబాబుకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## వరిలో కాలిబాటలు తప్పనిసరి

**ప్రజాశక్తి-కలసపాడు**

వరిలో కాలిబాటలు తప్పనిసరి అని రైతు శిక్షణ కేంద్ర అధికారి ఎం. శివశైలజపేర్కొన్నారు. మండలంలోని మహానందిపల్లి రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటలో యాజమాన్య పద్ధతులు, కాలిబాటలు వల్ల ప్రయోజనాలు వివరించారు. విత్తన శుద్ధి, నారు కొనలు తుంచి నాటడం వల్ల కలిగే ఉపయోగాలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. జాకీర్ షరీఫ్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం. అశోక్ కుమార్ రెడ్డి, ఎం. నాగ రత్న, బి. శివ, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది వాణి, సుహాసిని, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి ఎం.శివ శైలజ

## మహేష్ వార్డు మెంబర్ సభ్యత్వాన్ని రద్దు చేయండి

**ప్రజాశక్తి - వేంపల్లె**

వేంపల్లె పంచాయతీ పరిధిలో వార్డు మెంబర్‌గా ఉన్న కొత్తూరు మహేష్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని టిడిపి నేత రజనీకాంత్‌రెడ్డి (సూరి) కోరారు. ఆ మేరకు గురువారం ఆయన ఎంపిడిఒ సంపత్ దివిజాకు వినతిపత్రం అందజేశారు. వార్డు మెంబరుగా పని చేస్తున్న కొత్తూరు మహేష్ విజయవాడలో ఫైబర్‌నెట్‌లో ఉద్యోగం చేస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ రాజ్ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగం చేస్తూ వార్డు మెంబరుగా చెలామణి కావడం పట్ల వార్డు మెంబరు సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. ఉద్యోగం చేస్తున్న వారు ప్రజాప్రతినిధులుగా ఉండేందుకు వీల్లేదన్నారు. ఇందుకు ఎంపిడిఒ సంపత్ దివిజా స్పందిస్తూ వార్డు మెంబరుపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. దీనిపై విచారిస్తామన్నారు.

## బిందు, తుంపర సేద్య పరికరాలకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

మండలంలో బిందు, తుంపర సేద్య పరికరాల కోసం రైతులు నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఉద్యానశాఖ విస్తరణ అధికారి వీరారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ అవసరమైన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏడు సంవత్సరాలు క్రితం డ్రిప్ తీసుకున్న రైతులు కూడా మళ్లీ దరఖాస్తు చేసు కోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పాఠశాలలను మూసేయాలనుకోవడం దుర్మార్గం

**ప్రజాశక్తి - వేంపల్లె**

విద్యార్థుల సంఖ్య తగ్గిందనే సాకుతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మూసేయాలని ప్రభుత్వం ఆలోచించడం దుర్మార్గమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంటి నొప్పికి దవడమీద తన్నినట్లుంది రాష్ట్రంలోని టిడిపి కూటమి పాలన అన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతారనే... దాన్ని పట్టించుకోకుండా మూసేయాలని ఆలోచించడం శోచనీయం అన్నారు. 2022 జూన్ 10న వైసిపి ప్రభుత్వం జారీ చేసిన జిఒ 117 ప్రాథమిక విద్య ఉసురు తీసిందని తెలిపారు. ఆ జిఒ ప్రకారం 3,4,5 తరగతులను ప్రాథమిక విద్య నుండి విడగొట్టి సమీపంలో ఉండే ప్రాథమికోన్నత లేదా ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారన్నారు. పాఠశాలలు మూసే నిర్ణయం విద్యావ్యాప్తి, చట్టానికి వ్యతిరేకమన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిఒ 117ను రద్దు చేయడంతోపాటు 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని తులసిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

## గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - వేంపల్లె**

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భాస్కర్ కుటుంబానికి విక్టిమ్ ఫౌండేషన్ వారు ఆర్థిక సహాయం చేశారు. మండలంలోని తూపల్లె గ్రామానికి చెందిన భాస్కర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స అనంతరం ఇంటి వద్దనున్న భాస్కర్‌కు గురువారం విక్టిమ్ ఫౌండేషన్ అధ్యక్షులు శూలం లక్ష్మీదేవి రూ.6 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సేవా సంస్థ ద్వారా వివిధ సేవలను అందిస్తున్నామన్నారు. ఎవరైనా నిస్సహాయత స్థితిలో ఉంటే విక్టిమ్ ఫౌండేషన్ దృష్టికి తేవాలని కోరారు. మానవసేవే మాధవసేవగా భావించి సమాజంలోవున్న దాతలు ఇవ్వాలని కోరారు. దాతలు ముందుకు వచ్చి సమాజంలోని నిస్సహాయత స్థితిలో ఉన్న వారికి అండగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. ఫౌండేషన్ సభ్యులు ధనుంజయ, విజయ, సుబ్బయ్య పాల్గొన్నారు.

## అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

**ప్రజాశక్తి - ఖాజీపేట**

ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధికంగా విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ సహాయ సంచాలకులు మురళీధర్ హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక బస్టాండ్ కూడలిలోని పలు పురుగు మందుల దుకాణాలను ఎఒ తో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మకాలకు సంబంధించిన దస్త్రాలను వారు పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ దృష్ట్యా దుకాణదారులు విత్తన ఒద్దు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు రైతుల నుంచి అధికంగా వస్తున్నాయని తెలిపారు.

## వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలి : ఎంపిజె

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె) నాయకులు కోరారు. ఆ మేరకు గురువారం స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో ప్లకార్డులు చేతబూని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపిజె షేక్ సలీం, అన్సర్ మాజీ కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ముస్లింల భూ యాజమాన్య హక్కులను హరించేందుకు ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చే కుట్రలో భాగంగా వక్ఫ్ బోర్డు ఆస్తులను సైతం కాజేయడానికి ఏకంగా 40 సవరణలు చేసి బిల్లును పార్లమెంటు, రాజ్యసభలోనూ ప్రవేశపెట్టి ఆమోదించుకోవాలని కుట్రలు పన్నుతోందన్నారు. ఈ బిల్లును ఎన్‌డిఎ ప్రభుత్వంలోని భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన అధినేతలు పార్లమెంటులో పెట్టకుండా అడ్డుకోవాలని కోరారు. ఎంపిజె జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షుడు హుశేన్ బాషా, కార్యదర్శి మహమ్మద్ రఫి, మీడియా కార్యదర్శి అస్లాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పాఠశాల కమిటీ ఎన్నికలు



చైర్మన్ వైస్ చైర్మన్‌తో హెచ్‌ఎం, ఎన్నికల కన్వీనర్ జి.విశ్వభారతి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

జిల్లాలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగాయి. గురువారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 1,625 ప్రాథమిక పాఠశాలలు, 126 ప్రాథమికోన్నత పాఠశాలలు, 300 ఉన్నత పాఠశాలలు కలిపి 2,051 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1602 ప్రాథమిక పాఠశాలలో, 115 ప్రాథమికోన్నత పాఠశాలల్లో, 282 ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో 1,357 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 23 ప్రాథమిక, 11 ప్రాథమికోన్నత, 18 ఉన్నత పాఠశాలలో వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. పాత కడప జడ్పీ హైస్కూల్ సంబంధించి పాఠశాల హెచ్‌ఎం, ఎన్నికల కన్వీనర్ జి. విశ్వభారతి పర్యవేక్షణలో ఎన్నికలు సజావుగా కొనసాగాయి. 8 మంది చైర్మన్ పదవికి పోటీ పడగా మెజార్టీ ఓట్లు పి.బాలసుబ్బమ్మకు వచ్చాయి. దీంతో ఆమె చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ పదవికి ఇద్దరు పోటీ పడగా గుంట హిమబిందు వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. దాదాపు 11 గ్రామాల నుంచి ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఎన్నికకు హాజరయ్యారు. ఎన్నికల పర్యవేక్షణకు ఏఎస్ఐ, సచివాలయ పోలీసు, ఏఎన్ఎం హాజరయ్యారు. **కలసపాడు :** మండలంలోని తెల్లపాడు పాఠశాల విద్యాకమిటీ ఎన్నికల్లో 24 మంది తల్లిదండ్రులతో కలసి చైర్మన్‌ను ఎనుకున్నారు. చైర్మన్‌గా బిజీ వేముల భాస్కర్ రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా వై. లక్ష్మీదేవిని విద్యార్థుల తల్లిదండ్రులు, ఎన్నుకున్నారని ఎంఇఒ ప్రేమ్ సాగర్, ప్రధానోపాధ్యాయులు వి. మునెయ్య, తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఎం, శేఖర్ బాబు, టి .వెంకటసుబ్బయ్య, వి. రమాదేవి, బి. ఎన్. వి. ప్రసాద్, డి. విజయలక్ష్మి, జి. మధుసూదన్ రావు, మాజీ సర్పంచ్, ఈశ్వర్ రెడ్డి, మాజీ డీలర్, బిజీ వేముల, రోషి రెడ్డి. గ్రామస్తులు మండల టిడిపి ఎస్ సి సెల్ అధ్యక్షులు వద్దే పోగు సత్యం, కె. గురయ్య తిమోతి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. **కమలాపురం**: కమలాపురం మండలం పెద్ద చెప్పలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలలో పుత్తా పుల్లారెడ్డి పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ గాను, ఎస్.సమీరా భాను వైస్ చైర్మన్ గాను ఎన్నికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓబుల్ రెడ్డి వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి తోడ్పడిన విద్యార్థుల తల్లిదండ్రులకు ,గ్రామ పెద్దలకు ప్రధానోపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికయిన పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పుత్తా పుల్లారెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులను చేర్పించడానికి, విద్యార్థులు సక్రమంగా హాజరుకు, పాఠశాల అభివృద్ధికి గ్రామ పెద్దలు అందరి సహకారంతో తోడ్పాటు అందిస్తానని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ పెద్దలు కార్యక్రమంలోపాల్గొన్నారు. **కాశినాయన :** మండలంలో స్కూల్ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. 29 ప్రాథమిక ఉన్నత పాఠశాలలో కస్తూర్బా, ఎపి మోడల్ , మొత్తం 39 పాఠశాలల్లో విద్యాకమిటీ ఎన్నికలపెంఇఒ నిర్మల తెలిపారు. నరసాపురంలోని ఏపీ మోడల్ పాఠశాలకు చైర్మన్‌గా, వసుంధర వైస్ చైర్మన్‌గా కర్నాసి జమాల్ వలి 15 మంది సభ్యులతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రిన్సిపల్ సౌజన్య వారితో ప్రమాణస్వీకారం చేయించారు. **ఒంటిమిట్ట :** మండలంలోని ఎంపిపి, జడ్‌పి పాఠశాల్లో ఎంఇఒ ఆధ్వర్యంలో విద్యాకమిటీ ఎన్నికలు నిర్వహించారు. అన్ని పాఠశాలల్లోనూ చైర్మన్‌లు, వైస్ చైర్మన్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. **వేంపల్లె :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నికలను ప్రధానోపాధ్యాయులు నిర్వహించారు. ఎలాంటి ఘర్షణలు జరగకుండా సిఐ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఎన్నికైన పాఠశాల కమిటీ చైర్మన్లు అందరూ కలిసి టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ దేవస్థానం ఛైర్మన్ జయచంద్రారెడ్డి, మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫయాజ్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, వేమాకుమార్, రజనీకాంత్‌రెడ్డి, జబిబుల్లా, డాక్టర్ కరీముల్లా, డక్కా రమేష్, అల్లాబకష్, మాబు షరీఫ్, మహిళ నాయకులు రజీయా, గౌసియా, అమిరూన్ పాల్గొన్నారు. **ఖాజీపేట :** ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు, విద్యాశాఖలు గట్టి చర్యలు చేపట్టారు. ఆదర్శ పాఠశాల చైర్మన్‌గా డీఎస్ కళ్యాణి, వైస్ చైర్మన్‌గా ఓబులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల చైర్మన్‌గా గారెళ్ళ బ్రహ్మయ్య, వైస్ చైర్మన్‌గా జమాల్ బి.కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల చైర్మన్‌గా కొంగాని కల్పన, వైస్ చైర్మన్‌గా ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. **సింహాద్రిపురం :** మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాధికారి–2 శారద తెలిపారు. మండలంలోని 38 పాఠశాలల్లో కమిటీల నియామకం నిర్వహించారు. పది పాఠశాలల్లో కమిటీలు ఏకగ్రీవం కాగా, మరో 28 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణను ఎంపీడీవో సల్మాన్‌రాజ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ అనిల్‌కుమార్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. **ముద్దనూరు :** మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం మండల విద్యా శాఖాధికారులు నాగేశ్వర నాయక్, సుబ్బారావు ఆధ్వర్యంలో స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ (ఎస్ఎమ్‌సి) ఎన్నికలు నిర్వహించారు. 35 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలకు సంబంధించి స్కూల్ మేనేజిమెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. సిఐ దస్తగిరి, తహశీల్దార్ రమాకుమారి, ఎంపిడిఒ చంద్రమౌళీశ్వర్ పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులను ఏర్పాటు చేశారు. **చాపాడు :** మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్‌లలో గురువారం ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల పరిధిలో 62 పాఠశాలలు ఉండగా 60 పాఠశాలల్లో ఎన్నిక పూర్తయిందని ఎంఈఓ రవిశంకర్ తెలిపారు. బసిరెడ్డిపల్లి గ్రామంలో ఉపాధ్యాయుడు ఎన్నిక నిర్వహించకపోవడంతో అతనికి నోటీసు జారీ చేశామన్నారు. రేపల్లె గ్రామంలో కోరం లేకపోవడంతో ఎన్నిక వాయిదా వేశామన్నారు. 60 గ్రామాల్లో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగేందుకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు గ్రామపెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టిడిపి నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **చక్రాయపేట :** మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 61 పాఠశాలలో యాజమాన్యం కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంఇఒ–1 జాఫర్ సాదిక్, ఎంఇఒ–2 రవికుమార్ తెలిపారు. స్కూల్ కమిటీ చైర్మన్ ఎన్నికల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. **మైదుకూరు:** మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గురువారం పాఠశాల యాజమాన్య విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా స్థానిక అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 97 పాఠశాలలో ప్రశాంతంగా విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీకి చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకున్నారు. **వేముల :** మండల పరిధిలో గురువారం స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్‌గా వల్లెపు వెంకటేష్, ఉప చైర్మన్ సుమాంజలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా పాఠశాలలోనూ ఎక్కగ్రీవంగా ఎన్నుకొన్నారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య, యువత అధ్యక్షుడు విశ్వేశ్వర రెడ్డి, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్నికైన వారికి అభినందలతో సన్మానం చేశారు.

## వినేష్ ఫోగట్‌పై అనర్హత ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం : డివైఎఫ్ఐ

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

2024 పారిస్ ఒలింపిక్స్ నుండి వినేష్ ఫోగట్‌ను ఏకపక్ష, అన్యాయంగా అనర్హులుగా ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్ తెలిపారు. ఆ మేరకు గురువారం డివైఎఫ్ఐ పొద్దుటూరు పట్టణ కార్యాలయంలో నిరసన వక్తం చేశారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజ్, నాయకులు విశ్వనాథ్ మాట్లాడుతూ ఇది భారతీయ క్రీడలకు ఎదురుదెబ్బ మాత్రమే కాదని, ఫెయిర్ ప్లే, స్పిరిట్‌పై కఠోరమైన దాడిగా అభివర్ణించారు. వినేష్ ఫోగట్ స్థితిస్థాపకత, ధైర్యం, శ్రేష్ఠత యొక్క తిరుగులేని అన్వేషణకు చిహ్నామన్నారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో పాతుకుపోయిన అస్వస్థతను బహిర్గతం చేసిన అధ్యాయం, మాజీ బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్ అణచివేత పాలనకు వ్యతిరేకంగా ఆమె ప్రయాణం చారిత్రాత్మక పోరాటంతో ముడిపడి ఉందన్నారు. వినేష్ అనర్హత చుట్టూ ఉన్న పరిస్థితులు అనుమానాస్పదంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో రాము, చినబాబు, రవికుమార్, రమేష్, సతీష్, నాయకులు రాజు, సోమేష్, గుణ, నాగభూషణం, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు సాగునీరు అందించండి

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

రాయలసీమ రైతులకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి మంత్రులను కోరారు. ఆ మేరకు వారు అమరావతి సచివాలయంలోని మంత్రుల ఛాంబర్‌లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని, నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

## దర్జాగా కారులో వచ్చి పట్టుచీరలు కాజేసిన మహిళలు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

ప్రొద్దుటూరులో కొంతమంది మహిళలు ఒక వస్త్ర దుకాణంలోకి కొనుగోలుదారులుగా వెళ్లి తమ చేతివాటం చూపించారు. ఆర్స్ కళాశాల రోడ్డులో ఉన్న ఒక వస్త్ర దుకాణంలోకి ఆరుమంది మహిళలు ఒక ఇన్నోవా వాహనంలో దర్జాగా వచ్చారు. ఖరీదైన 10 పట్టు చీరలను దొంగలించారు. వస్త్ర దుకాణంలో పనిచేసే సిబ్బందిని మాటల్లో పెట్టి ఖరీదైన పట్టు చీరలను చాలా చాకచక్యంగా దొంగలించారు. పట్టు చీరలు తక్కువగా ఉండడంతో యజమానికి అనుమానం వచ్చింది. ఈ దొంగతనం వ్యవహారం అంతా షాపులో ఉన్న సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. మహిళలు వెళ్లిన తర్వాత షాపు యజమాని పట్టుచీరలను చూసుకుంటే చీరలు తక్కువగా కనిపించడంతో సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఇన్నోవా వాహనంలో వచ్చిన మహిళలు ఎంచక్కా దొంగతనం చేసి వెళ్లిపోయారని గమనించారు. పోలీసుల కేసు నమోదు చేసి మహిళల కోసం గాలిస్తున్నారు.

## పెట్రోల్ బంక్‌లో ద్విచక్ర వాహనం చోరీ

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మండలం పరిధిలోని బుడ్డాయిపల్లె సమీపంలో కడప–కర్నూల్ జాతీయ రహదారిపై ఉన్న ఓ పెట్రోల్ బంకులో గురువారం తెల్లవారు జామున పల్సర్ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. చోరీ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీ ఫుటేజీలో నమోదయ్యాయి. ద్విచక్ర వాహన చోరీకి సంబంధించిన ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఖాజీపేటలో వరుస చోరీ ఘటనలు ప్రజలు, ద్విచక్ర వాహనదారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. పోలీసులు రాత్రిపూట గస్తీని ముమ్మరంగా సాగిస్తున్నా దొంగతనాలు జరుగుతుండడం పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## 'ఎన్‌ఎంఇఒ-ఒపి' ద్వారా రైతులకు ప్రోత్సాహం

**ప్రొద్దుటూరు( పుట్టపర్తి సర్కిల్) :** రేగులపల్లిలో ఉద్యానశాఖ, వైఎస్ఆర్ జిల్లా సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రయివేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలో నూతన పంటగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సువెన్ ఆగ్రో కంపనీ ప్రతినిధి కొండారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా ఆయిల్‌పామ్ పంటను సాగు చేసేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి బి.మఠం, మైదుకూరు, ప్రొద్దుటూరు, శ్రీ అవదూత కాసినాయన, పులివెందుల మండలాల్లో ఉద్యాన పంటగా ఆయిల్‌పామ్ పంటను సాగు చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఉద్యానశాఖ అధికారి ఎన్ఎం ఈఓ–ఓపీ పథకం ద్వారా ఈ పంట సాగుకు కేంద్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. ఆసక్తి ఉన్న జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పులివెందుల ఉద్యాన శాఖాధికారి జయభరత్‌రెడ్డి, సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ జిఎం పిఎం కొండారెడ్డి, వ్యవసాయ, ఉద్యాన గ్రామ సహాయకులు, ఔత్సాహిక రైతులు పాల్గొన్నారు.

## ఎన్.కొట్టాలపల్లెలో పారిశుధ్య పనులు

**ప్రజాశక్తి వార్తకు స్పందన**

**ప్రజాశక్తి - పెద్దముడియం**

మండలంలోని ఎన్. కొత్తపల్లెలో అధికారులు గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. 'ప్రజాశక్తి' దినపత్రికల్లో బుధవారం 'పారుతున్న మురుగు–పట్టని అధికారులు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇందుకు ఎంపిడిఒ లక్ష్మీనరసింహ స్పందించి వెంటనే ఎన్.కొట్టాలపల్లి గ్రామవీధుల్లో నిలిచిన మురుగనీటిని తొలగించి, పారిశుధ్య పనులు చేయించారు. కథనం ప్రచురితం కాగానే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించినందుకు స్థానికులు 'ప్రజాశక్తి'కి కృతజ్ఞతలు తెలిపారు.



మురుగు ప్రాంతాల్లో బ్లీచింగ్‌పౌడర్ చల్లుతున్న సిబ్బంది

## సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

**- కడప బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రావు**

**ప్రజాశక్తి - వేంపల్లె**

ధూప, దీప, నైవేద్యాలకు రూ.10వేలు దేవాలయాలకు ఇవ్వడం చంద్రబాబు ప్రభుత్వానికే సాధ్యమని కడప బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రావు తెలిపారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాగళంలో అర్చకులకు, దేవాలయాలకు ఇచ్చిన వాగ్దానం మేరకు ధూప, దీప, నైవేద్యాలకి నోచుకోని సుమారు 6 వేల దేవాలయాలకు గతంలో పనిచేసిన చంద్రబాబు ప్రభుత్వంలోనే ఇచ్చిన రూ5 వేల నుంచి రూ.10 వేలకు పెంచారన్నారు. ఇందుకు రాష్ట్రంలో ఉన్న అర్చక సంఘాలు, అర్చకులు, భక్తులు, బ్రాహ్మణ సమాజం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీసుకున్న ఈ నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో మురళీధర్, సుధాకర్, బోస్ శ్రీనివాస రావు, శేషగిరిరావు పాల్గొన్నారు.

## అనాథశ్రమంలో అన్నదానం

**ప్రజాశక్తి - ముద్దనూరు**

ప్రొద్దుటూరుకు చెందిన గోపీకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ కెవి రమణారెడ్డి వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన సమీప బంధువు ముద్దనూరు మండల నాయకులు రాజుల సురేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కోడిగాండ్లపల్లె సమీపంలో ఉన్న ఏసు కరుణాలయం అనాథశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఇమ్మానియేలు పాల్గొన్నారు.

## దోమకాటు ఆరోగ్యానికి హానికరం

**- సబ్ యూనిట్ వైద్య అధికారి సిద్దయ్య**

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

దోమకాటు ఆరోగ్యానికి హానికరమని మలేరియా సబ్ యూనిట్ వైద్యాధికారి సిద్ధయ్య తెలిపారు. నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మోట్నూతలపల్లిలో గురువారం ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. నిల్వలున్న నీటిలో, నీటి తొట్టెలో అబెట్‌తో పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమకాటుతో మలేరియా, డెంగీ, చికెన్ గునియా, బోదకాలు, మెదడు వాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. పనికిరాని గుంతలను, లోతట్టు ప్రదేశాలను, వాడని బావులను పూడ్చాలన్నారు. చెత్త చెదారం మురుగు కాలువల్లో చేరకుండా చూడాలన్నారు. మురుగు కాలువల్లో పూడిక తీసి నీరు పారేలా చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జగదీష్. ఎం.ఎల్.హెచ్.పి. శైలాబీ, ఆరోగ్య కార్యకర్తలు షీబారణి, రమాదేవి, ఆశా కార్యకర్త రాజాబీ పాల్గొన్నారు.

## వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**



పులివెందుల మున్సిపల్ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామంలో శ్రీ అంకాలమ్మ తల్లి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు వెల్లాల సీతారామ శర్మ ఆధ్వ ర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. రెండవ రోజు గురువారం ఉదయం పూజా కార్యక్ర మాలతో ప్రారంభమయ్యాయి. అంకాలమ్మ అమ్మ వారిని ప్రత్యే కంగా అలంకరించారు. అమ్మవారి గ్రామోత్సవాన్ని ప్రజలు కనులవిందుగా నిర్వ హించారు. మంగళ వాయిద్యాలు, చెక్క భజనలు చేస్తూ గ్రామోత్సవం సాగింది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

**నేడు బండలాగుడు పోటీలు**

శ్రీఅంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనలో భాగంగా మూడవ రోజు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. మొదటి బహుమతి రూ.60 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ.15 వేలు, ఆరవ బహుమతి రూ.10 వేలు, ఏడవ బహుమతి రూ.8 వేలు, ఎనిమిదవ బహుమతి రూ.6వేలు, తొమ్మిదవ బహుమతి రూ.5 వేల ఐదు వందలు, పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క కాడికి రూ.5వేలు కన్సలేషన్ బహుమతిని అందించనున్నారు. పోటీలకు యాంకర్‌గా చిరంజీవి వ్యవహరించనున్నారు. చుట్టు పక్క గ్రామాల ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామపెద్దలు కోరారు.

## అన్నీ పులివెందులకే అనడం సరికాదు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

కడప పార్లమెంటు పరిధిలో కేవలం పులివెందుల ఒక్కటే ఉన్నట్లు చూస్తున్నారని, మిగతా నియోజకవర్గాల గురించి ఆలోచన చేయాలని, తాజాగా ప్రభుత్వ సైనిక పాఠశాల కూడా పులివెందులకు కావాలని ఎంపీ అవినాష్‌రెడ్డి కేంద్రాన్ని కోరడం తగదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పులివెందులలో పలు ప్రముఖ సంస్థలున్నాయని తెలిపారు. ప్రొద్దుటూరుకు దక్కాల్సిన మెడికల్ కాలేజ్ కూడా పులివెందులకు తరలించారన్నారు. ఇప్పుడు సైనిక్ స్కూల్ కూడా అక్కడే ఏర్పాటు చేయాలనడం సరికా దన్నారు. మైదుకూరు, బద్వేల్ వంటి వెనుక బడిన ప్రాంతాలను ఎంపీ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారని ఆరోపించారు.